రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:24 శుక్రవారం
సహర్ 4:55 శనివారం

చేపల పెంపకంపై దృష్టి సారించాలి : కలెక్టర్

కరీంనగర్ టౌన్, మార్చి 14: చేపల పెంపకంపై దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంపై సమావేశం నిర్వహించారు. పథకం ద్వారా చేకూరే లాభాలు, ఆదాయ మార్గాలు, నష్ట నివారణపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్ఓ దేవేందర్, ఫిషర్‌మన్ రాజన్న పాల్గొన్నారు.



● ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
● 'పది' పరీక్షా కేంద్రాల్లో 1 నుంచి సాయంత్రం 5 వరకు

నేటి నుంచి ఒంటి పూట బడి

కరీంనగర్ టౌన్, మార్చి 14: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. ఎండలు మండిపోతుండడంతో ప్రతి యేడు మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకొని ఒంటిపూట బడులను నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో 'పది' పరీక్షలు పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఈ విద్యాసంవత్సరం చివరిరోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, తరగతుల నిర్వహణ అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని సూచించింది.

దీనితో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటి పూట బడుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని సూచించారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండగా మార్చిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ 36నుంచి 38 డిగ్రీలకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో మార్చి చివరి వారంతో పాటు ఏప్రిల్‌లో మరింత ఎండలు ముదురుతాయని, ఒంటిపూట బడి సమయాన్ని ఎండల తీవ్రతను బట్టి తగ్గించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ నెల 18 నుంచి 'పది' పరీక్షలు

పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులకు డిసెంబర్ నుంచే ప్రత్యేక తరగతు లను నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రా ల్లో ఫర్నిచర్, గాలి, వెలుతురు, మంచినీటి వసతి, మరుగు దొడ్ల వంటి మౌలిక వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పరీక్షా కేంద్రాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా సమయా నికి 5 నిమిషాల ఆలస్యంగా వచ్చిన వారిని సైతం పరీక్ష రాసేందుకు అనుమతించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కొంత ఊరట చెందారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

● ఆఖరిరోజు 383 మంది గైర్హాజరు
● హుషారుగా ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు
● కిటకిటలాడిన బస్‌స్టేషన్ ప్రాంగణాలు


ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

కరీంనగర్ టౌన్, మార్చి 14: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఆఖరి రోజు జరిగిన రెండో సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు జనరల్ విభాగంలో 293 మంది, ఒకేషనల్ విభాగంలో 90 మంది మొత్తం 383 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే జనరల్ విభాగంలో 13,879 మంది, ఒకేషనల్ విభా గంలో 971 మంది మొత్తం 14,850 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాధికారి తెలిపారు. జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ కూడా విద్యార్థులు ఇబ్బందులు పడలేదని, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ బృందాలతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. కొన్నికేంద్రాల్లో కాపీయింగ్ చేస్తుండగా పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసి డీ బార్ చేయడం జరిగిందని వివరించారు. మొత్తంగా జిల్లాలో అందరి సహకారంతో ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని చెప్పారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హుషారుగా ఇళ్లకు వెళ్లారు. రెండు సంవత్సరాలుగా కలిసి చదువుకున్న వీరు ఒకరి కొకరు వీడ్కోలు తెలుపుకున్నారు. చాలా మంది విద్యార్థులు హాస్టల్స్ అద్దె గదులను ఖాళీ చేసి లగేజీతో వారి స్వగ్రామాలకు వెళ్లడంతో ఆర్టీసీ బస్‌స్టేషన్ విద్యార్థులతో కిటకిట లాడింది. విద్యార్థులందరూ కుటుంబ సభ్యులతో కలిసి హుషారుగా ఇళ్లకు వెళ్లారు.


పరీక్షలు పూర్తవడంతో కేరింతలు కొడుతున్న ఇంటర్ విద్యార్థినులు

కరీంనగర్‌లో ఎస్‌ఐబీ వార్‌రూమ్

● జిల్లా నాయకుల ఫోన్ ట్యాపింగ్‌పై చర్చ

కరీంనగర్ క్రైం, మార్చి 14: గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)కి చెందిన అధికారులు కరీంనగర్ జిల్లాలో వార్‌రూమ్ ఏర్పాటు చేసి కొందరి ఫోన్‌లను ట్యాపింగ్ చేసి అంతర్గత సంభాషణలు విన్నారనే అంశంపై జిల్లాలో తీవ్ర చర్చనడుస్తోంది. గత ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులతో పాటు విపక్షాలకు నిధులు ఇచ్చే కొందరు వ్యాపారులు, మరి కొందరి ఫోన్‌లను ట్యాపింగ్ చేసి సమాచారాన్ని ప్రభుత్వ పెద్దలకు చేరవేశారని రెండు రోజుల కిందట ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన మాజీ ఎస్ఐబి డీఎస్పీ ప్రణీత్‌రావును విచారించిన పోలీసు అధికారులు వెల్లడించారు. ఇందులో కరీంనగర్ జిల్లా కూడా ఉందని వార్త రావటంతో జిల్లాలో ఏ రాజకీయ నాయకులు, వ్యాపారుల ఫోన్ ట్యాపింగ్ చేశారని, ఎక్కడ వార్‌రూం ఏర్పాటు చేశారని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, వ్యాపారులు చర్చించుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ ద్వారా కరీంనగర్ లేదా హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటుందని చర్చ నడుస్తోంది. జిల్లాకు చెందిన కొందరు రాజకీయ పార్టీల నాయకులు వారి ఫోన్‌ట్యాపింగ్ జరుగుతున్నట్లు గతంలో పలు సందర్భాలలో అనుమానాలు వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న కౌంటర్ ఇంటలిజెన్స్ విభాగంలో ఈ ఫోన్ ట్యాపింగ్ పరికరాలను ఏర్పాటు చేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించిన సమాచారంతోనే జిల్లాలో ఎవరెవరి ఫోన్‌లు ట్యాపింగ్ అయ్యాయనే విషయం బహిర్గతం కానుంది.

బీజేపీతోనే రైతు సంక్షేమం

● సాగునీరందించకుంటే ఆందోళన ● గంగాధర మండల ప్రజాహిత యాత్రలో బండి సంజయ్‌కుమార్


ఉప్పరమల్యాలలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

గంగాధర, మార్చి 14: బీజేపీతోనే రైతు సంక్షేమమని ఎంపీ బండిసంజయ్ అన్నారు. గురువారం గంగాధర మండలం గర్షకుర్తి, ఉప్పరమల్యాల,వెంకంపల్లి గ్రామాల్లో ప్రజాహిత యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా గర్షకుర్తిలో 5లక్షల సీసీ రోడ్డు, 5లక్షల చేనేత కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు, 2లక్షలతో వెంకటేశ్వర దేవాలయ మండప నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప్పర మల్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అభి వృద్ధి సంక్షేమం పేరుతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు, జాగలేని కుటుంబాలకు 5లక్షలు, 2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ఇస్తానన్న పైసలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ప్రధాన మంత్రి అభ్యర్థి లేని కాంగ్రెస్ ఎలా ఓటు అడుగుతుందని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే పోలీసులు నా ఇంటిపై దాడి చేసి నాలుగు రోజులు జైల్లో పెట్టించారన్నారు.

నాపైన 100 కేసులున్నా ప్రజలకోసం విశ్రాంతి లేకుండా కొట్లాడుతున్నానన్నారు. అభివృద్ధి, ఉద్యోగాల కోసం కొట్లాడా మన్నారు. వేములవాడ అభివృద్ధికి రూ. 500 కోట్లు తీసు కొస్తానంటే కేసీఆర్ పర్మిషన్ ఇవ్వలేదన్నారు. ఆయన చేయలేదు చేస్తానంటే అడ్డుపడ్డారని దుయ్యబట్టారు. ఏవైనా నిధులు, నియామకాల కోసం కొట్లాడుతే నా కుటుంబమంతా బిక్కుబిక్కుమంటూ కేసులు ఎక్కడ పెడుతారో, ఎక్కడ జైల్లో వేస్తారోనని భయపడుతున్నారన్నారు. అయినా ప్రజల కోసం, సంక్షేమం కోసం పోరాటం ఆపనన్నారు. ఈ రోజు వ్యవసాయం చేద్దామంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలను పూర్తి చేసి సాగు నీరందించలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఉన్న కాలువకే నీరు లేదు రెండవ కాలువ తవ్వుతున్నారన్నారు. రెండు రోజుల్లో వరద కాలువకు నీరు విడుదల చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించా రు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, నియో జకవర్గం నాయకులు పెరుక శ్రవణ్‌కుమార్, వైద రామానుజం, దూళం కళ్యాణ్, శ్రీపతి చంద్రశేఖర్, వినయ్‌సాగర్, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలల్లో మౌలిక వసతులు

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కరీంనగర్ టౌన్, మార్చి 14: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యార్థుల యూనిఫాంలు కుట్టే బాధ్యతలను స్వశక్తి సంఘాలకు అప్పగించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు వంటి పది పనులను జూన్ పదవ తేదీ వరకు కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల వద్ద 25 వేల రూపాయల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించుకోవచ్చన్నారు. డీఎంఎఫ్‌టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగించుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. లక్షలోపు పనులను ఎంపిడివోలు, లక్షకు పైగా పనులను జిల్లా కలెక్టర్‌లు చెల్లింపులు చేస్తారన్నారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌డిఓ శ్రీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రావు, ప్రణాళిక అధికారి కొమురయ్య పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం


సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి

పాఠశాలల్లో ఏది కావాలన్నా చేయిస్తా
తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి
వైద్యపరంగా 24గంటలు అందుబాటులో ఉంటాం
రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, మార్చి 14: ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ సర్కారు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, పాఠశాలల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం మంత్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లిలో మండలానికి సంబంధించిన సుమారు కోటి రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఒకే చోట, అమ్మనగుర్తి గ్రామంలో రెండు కోట్లతో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్కేపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

పాఠశాలలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకవస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. అదనపు తరగతి గదులు, కిచన్ షెడ్లు, టాయిలెట్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు వైద్య పరంగా సేవలందించేందుకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటామన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చానని, ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తానన్నారు. తాగు, సాగు నీటికి ఇబ్బంది కలుగకుండా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు సుమారు రూ.3.50కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. రైతులకు సాగు నీటి కోసం ఇబ్బంది పడ కుండా చూస్తానన్నారు. ప్రజల సహకారం ఉంటే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పాఠశాలల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ సమేలా సత్పతి సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం అమ్మనగుర్తి సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన దాత కాయిత యాదగిరిరెడ్డిని మంత్రి సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపీపీ సార బుడ్డ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేంద్ర, ఎన్ పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, ఎంపీటీసీలు సంతోష్, అరుణ-మల్లయ్య, ఓదెలు, చాంద్ పాషా, మల్లేషం, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వీరుల చరిత్ర పుస్తకాల్లో చేర్చాలి

● ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు ఏర్పాటు చేయాలి
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, మార్చి 14: సాయుధ పోరాట వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్పించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 76 వర్ధంతి సందర్భంగా గురువారం నగరంలోని విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం సర్కారుకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన అమర వీరులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావుల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పేదల పక్షాన దేశ్‌ముఖ్‌లు, పటేల్ పట్వారీల పెత్తనం, నిజాం నవాబులు, రజాకార్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ నాయకులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మాక్దూమ్ మొహయుద్దీన్‌లు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. 1948 మార్చి 14న మహ్మదాపూర్‌లో దళం సభ్యులతో భోజనం చేస్తుండగా అనభేరితో పాటు మరో 12 మంది రజాకార్లు జరిపిన కాల్పుల్లో అసువులు బాసారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం కమ్యునిస్టుల త్యాగాల ఫలితంగా నిజాం ప్రభుత్వం భారతదేశంలో విలీన దినోత్సవాన్ని కర్ణాటక, మహారాష్ట్రలలో అధికారికంగా నిర్వహిస్తున్నారని, తెలంగాణలో మాత్రం నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, అనభేరి కుమార్తె విప్లవకుమారి, కిన్నెర మల్లవ్వ, పైడిపల్లి రాజు, బుచ్చన్న యాదవ్, చాడ శ్రీధర్‌రెడ్డి, బామాండ్లపల్లి యుగేందర్ పాల్గొన్నారు.



రెవెన్యూ, పోలీస్ శాఖల్లో కలకలం

● వీణవంక, జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయాలపై చర్చ
● కొందరు పోలీసు సిబ్బందిపై విమర్శలు

హుజూరాబాద్, మార్చి 14: పాలనలో కీలకంగా వ్యవహరించే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారుల పనితీరుపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో కొంత మంది పోలీస్, రెవెన్యూ ఉద్యోగుల తీరు ఆ శాఖలకే మచ్చగా నిలుస్తోంది. వీణవంక, జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనలు చర్చనీయాంశంగా మారాయి. వీణవంక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే పోలీస్ సిబ్బందిపై ఆరోపణలు రావడంతో ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. వీణవంక మండలానికి చెందిన రామిడి శివప్రియ అమెరికాలో ఉంటున్నారు. ఆమెకు చెందిన 16 గుంటల భూమిని ధరణి ఆపరేటర్ సహకారంతో వేరే వ్యక్తులపై రిజిస్ట్రేషన్ చేశారు. ఇది గమనించిన తహసీల్దార్ తిరుమల్‌రావు పోలీస్‌స్టేషన్లో ధరణి ఆపరేటర్‌పై ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదైంది. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన తహసీల్దార్ తిరుమల్‌రావును జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడంతో పాటు అటెండర్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ స్థాయి వరకు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా, జమ్మికుంట తహసీల్దార్ రజనిపై ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే సమాచారం మేరకు ఆమె ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు చేసి సుమారు రూ. 12 కోట్లకు పైగానే ఆస్తులు ఉన్నట్లు గుర్తించి, ఆమెను అరెస్టు చేశారు.

భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు

హుజూరాబాద్ డివిజన్‌లోని తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేయకుండానే రెవెన్యూ కార్యాలయాల్లో గుంటలుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. నాలా కన్వర్షన్ చేయకున్నా ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రియల్ వెంచర్లలో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ రెవెన్యూ రిజిస్ట్రేషన్లపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల పనితీరుపై సీపీ స్పెషల్ టీమ్

హుజూరాబాద్ డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న సిబ్బందిపై స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సీపీ అభిషేక్ మొహంతి పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్లో పనిచేసే సిబ్బంది బెల్ట్ షాపులు, వైన్ షాపులు, గుట్కా, ఇసుక ట్రాక్టర్లు, రేషన్ బియ్యం, క్రషర్ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీణవంక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బందిపై ఆరోపణలు రావడంతో రెండ్రోజుల క్రితం ఎస్‌బీ, ఇంటలిజెన్స్ పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం. డివిజన్‌లోని రెండు పోలీస్‌స్టేషన్లలో పైసలు ఇవ్వనిదే పనిజరగడం లేదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని కొంత మంది సీపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మార్చి 14: విద్యుదాఘాతంతో గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణంలోని కమాన్ రాజీవ్ రహదారి ప్రాంతానికి చెందిన కాటన్ శ్రీనివాస్ తన ఇంటి రెండో అంతస్తులో ఉన్న ఇనుప పైపులను తీస్తుండగా పైన ఉన్న 11 కేవీ లైన్లకు తగిలి విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 14: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఆదికేశవ పెరుమాండ్ల స్వామి గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,080 నగదు, నాలుగు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని వివరించారు.

రేషన్ బియ్యం గోదాంకు తరలింపు

ధర్మారం, మార్చి 14: మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బైరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 150 క్వింటాళ్ల రేషన్ బియ్యంను గురువారం ధర్మారం నుంచి సివిల్ సప్లై అధికారులు పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

బుధవారం బైరెడ్డిపల్లిలో నలుగురు వ్యక్తులు అక్రమంగా రేషన్ బియ్యంను నిల్వ చేశారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి అక్కడి నుంచి ధర్మారంలోని రేషన్ దుకాణంలో భద్రపరిచారు. ఇక్కడి నుంచి గురువారం సాయంత్రం సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లు శంకర్, రవీందర్‌రాథోడ్, పెద్దపల్లి, మంథని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు మల్లికార్జున్, శ్రీనివాస్ పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

చికిత్స పొందుతూ వలస కార్మికురాలి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 14: మండలంలోని ఓ ఇటుక బట్టీలో బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవపూర్‌లోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు ఒరిస్సా నుంచి సమిత్ర బోయి(57) కార్మికురాలు వచ్చింది.

అనారోగ్య సమస్యలు ఉన్నాయని, బుధవారం ఆస్తమా ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త సర్తా బోయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తు పెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్కుల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్ రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.



ప్రణీత్‌రావు (ఫైల్)

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్కులు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.


మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



రాగిడి లక్ష్మారెడ్డి



ఆత్రంసక్కు

'కదనభేరి సక్సెస్‌తో బండి సంజయ్ గుండెల్లో గుబులు'

కరీంనగర్ టౌన్, మార్చి 14: కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కదనభేరి విజయవంతంతో ఎంపీ బండి సంజయ్ గుండెల్లో గుబులు మొదలైందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్, వినోద్ కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ అవాస్తవాలను మాట్లాడుతూ అబద్ధాలకు నిలువుటద్దంగా సంజయ్ మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని సంజయ్‌కి హెచ్చరించారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నాయకులు చీటి రాజేందర్‌రావు, వొల్లాల శ్రీనివాస్, వంగర రవీందర్, మారుతి, సలీం, జీఎస్ ఆనంద్, సంపత్, బోనగిరి సాయికృష పాల్గొన్నారు.

'అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?'

కరీంనగర్ టౌన్, మార్చి 14: నియోజకవర్గంలో ఎంపీ బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. అబద్ధాల మాటలు చెప్పి ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ ఇంకెన్నాళ్ళు రాజకీయాలు చేస్తావ్ అని బండిసంజయ్‌పై ఆయన మండిపడ్డారు. గురువారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన కదనభేరి సభ సక్సెస్‌తో బండి సంజయ్‌కుమార్ మతిలేని మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఈమీడియా సమావేశంలో నాయకులు హరిప్రసాద్, మహేశ్, అనిల్‌గౌడ్, తిరుపతి, జయంత్, రవికాంత్ పాల్గొన్నారు.

'నగరంలో మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ'

కరీంనగర్ టౌన్, మార్చి 14: నగరంలో పారిశుధ్య నిర్వహణ పనులను మరింత మెరుగు పరిచేందుకు తమ పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నూతనంగా కొనుగోలు చేసిన ఆరు స్వచ్ఛ ఆటోలను పాలకవర్గసభ్యులతో కలిసి మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ ఒక్కో వాహనానికి రూ.8.50 లక్షలు చెల్లించి ఆరు స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవి మహేశ్, చాడగొండ బుచ్చిరెడ్డి, బండారి వేణు, గంట కల్యాణి శ్రీనివాస్, యాదయ్య, సరిళ్ళ ప్రసాద్, దిండిగాల మహేశ్, వాల రమణారావు, తోట రాములు, గుగ్గిళ్ళ జయశ్రీ, సుధగోని మాధవికృష్ణగౌడ్, ఐలేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● నగరపాలక సంస్థ పరిధిలోని 18,19 డివిజన్లలో మేయర్ యాదగిరి సునీల్‌రావు 28 లక్షలతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవికృష్ణగౌడ్, ఎదుల్ల రాజశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. 12 బైక్‌లు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 14: పార్క్ చేసిన బైక్‌లను దొంగిలించిన ఒక నిందితుడిని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన చింతల సంపత్ అనే వ్యక్తి ఈనెల 11న తన ప్యాషన్‌ప్రో (ఏపీ 15 ఈపీ 2507) బైక్‌ను ప్రతిమ మల్టీప్లెక్స్ ఎదుట పార్క్ చేసి, పని చూసుకుని తిరిగి వచ్చేసరికి బైక్ కనపడకుండా పోయింది. దీంతో బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్న క్రమంలో గురువారం ఉదయం ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు కేబుల్ బ్రిడ్జి చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి బైక్‌ను ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా 12 బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడైన పెద్దపల్లి జిల్లా మంథని ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన గోస్కుల రాజు(27) తను బైక్ కొనుగోలుకు డబ్బులు లేనందున పార్క్ చేసి ఉన్న బైక్‌లను దొంగిలించి కన్సల్టెంట్ నిర్వాహకులకు బైక్‌లను విక్రయించి వచ్చిన డబ్బులతో కొత్త బైక్ కొనుగోలు చేయాలని నిశ్చయించుకుని దొంగతనాలకు పాల్పడ్డాడు. పెద్దపల్లిలో 2023లో 2 బైక్‌లు, 2024లో 2 బైక్‌లు, సుల్తానాబాద్‌లో 5 బైక్‌లు, కరీంనగర్ టౌన్‌లో 2 బైక్‌లు, గోదావరిఖనిలో 1 బైక్‌ను గోస్కుల రాజు దొంగిలించాడు. నిందితుడి ఇంటి వద్ద నుంచి దొంగిలించిన 12 బైక్‌లను స్వాధీనం చేసుకుని గోస్కుల రాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఏసీపీ నరేందర్ తెలిపారు. కాగా బైక్ దొంగను పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన సీఐ జె సరిలాల్, ఎస్ఐ ఎం స్వామి, కె రవి, కె కళ, హెడ్‌కానిస్టేబుల్ హసనుద్దీన్, కానిస్టేబుల్ భాస్కర్, కుమారస్వామిలను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించి, నగదు రివార్డును అందించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 14: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వాగులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ఇద్దరిపై గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడిన కేసులో నిందితులు ట్రాక్టర్ యజమాని బండారి సంపత్, శ్రీనివాస్‌లను గురువారం అరెస్టు చేసి, కోర్టు ఆదేశాలతో జైలకు తరలించామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

పారా మిలటరీ బలగాల కవాతు



మాట్లాడుతున్న హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్‌గౌడ్

సైదాపూర్, మార్చి 14: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆదేశాల మేరకు సైదాపూర్ మండల కేంద్రంలో కేంద్ర పారా మిలటరి బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు జన్ను ఆరోగ్యం, లక్ష్మారెడ్డి, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

మానకొండూర్: పార్లమెంట్ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మానకొండూర్‌లో గురువారం స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. చెరువుకట్ట బస్టాండ్ నుంచి మార్కెట్, తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా పల్లెమీద బస్టాండ్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో సీఆర్‌పిఎఫ్ బలగాలతో పాటు మానకొండూర్ పోలీసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి చీరసారే ప్రదానం

మానకొండూర్, మార్చి 14: మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటానికి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం చీరసారే ప్రదానం చేశారు. ఇటీవల కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కదనభేరి సభలో ఎంపీ బండి సంజయ్‌పై రసమయి చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా చీరసారే ప్రదానం చేసినట్టు బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బండి సంజయ్‌పై రసమయి బాలకిషన్ విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు సొన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్, నందగిరి బలరాం, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

మానకొండూర్, మార్చి 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర) వార్షికోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారనాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు. విద్యార్థులు ఆలరించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదివినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థిగా, సర్పంచు, జడ్పీచైర్మన్, ఎమ్మెల్యేగా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, ఎంఈవో మధుసుదనాచారి, హెచ్ఎం డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శంభుని జాతర

చొప్పదండి, మార్చి 14, చొప్పదండిలోని శివకేశవ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జాతర వైభవంగా జరిగింది. మండలంతో పాటు పొరుగు మండలాల నుంచి భారీగా భక్తులు హాజరై శివకేశవులను దర్శించుకున్నారు. వేకువజాము నుంచే స్వామి వార్ల దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశా రు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

-శాతవాహన యూనివర్సిటీ ఉప కులపతి సంకశాల మల్లేష్



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మల్లేష్, అతిథులు

గణేశ్‌నగర్, మార్చి14: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శాతవాహన విశ్వ విద్యా లయం ఉప కులపతి ఆచార్య సంకశాల మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శాతవాహన వికల్ప-2024 కామర్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య సంకశాల మల్లేష్ మాట్లాడుతూ 1000 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు ఒకేచోట వివిధ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వచ్చిన డాక్టర్ బీఎస్ రావు మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ప్రజలకు వైద్య విధానాలపై అవగాహన కల్పించాలని, దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమన్నారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉపాధి పొందుతున్నారని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆచార్య జె.రవికుమార్ మాట్లా డుతూ కామర్స్ విద్యార్థులు పోటీప్రపంచంలో తమ సత్తా చాటాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంచుకోవాలని అన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్స్ డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలను పెంచుకోవాలని కోరారు. డాక్టర్ ఇ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. వికల్ప-2024 కన్వీనర్ డాక్టర్ డి.హరికాంత్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచే ఇలాంటి కార్యక్రమాలు చేయటంలో ఎప్పుడు ముందు వరుసలో ఉంటామన్నారు. కామర్స్ విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పెంచు కునేలా శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి.నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, బి.అనిల్, సందీప్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

భగత్‌నగర్, మార్చి 14: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టింది. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో అర్హులైన 71 మందిలో హాజరైన 64మందికి కండక్టర్ ఉద్యోగం కోసం సర్టిఫికేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) భూపతిరెడ్డి పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారిణుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 14: దాద్రానగర్ హవేలిలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే సీనియర్ జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారిణీలు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 17,18,19 తేదీల్లో కరీంనగర్ నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటి ఎస్.సంపూర్ణ, ఏ.పూజిత, ఎం.యోగేశ్వరీ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మన్ తెలిపారు.

బతుకమ్మ ర్యాంప్ కూల్చివేత

కరీంనగర్ రూరల్, మార్చి 14: కరీంనగర్ రూరల్ మండలంలోని ఫకీర్‌పేట్ చెరువు వద్ద బతుకమ్మ సిమెంట్ ర్యాంపు, మెట్లను కూల్చి వేశారు. గతంలో జిల్లా పరిషత్ నిధులు 1.50 వేలతో పనులు ప్రారంభించినా ఒక్క రూపాయి బిల్లు రాలేదని, పట్టా ల్యాండ్‌లో నిర్మించడంతో భూ యజమానులు అభ్యంతరం చెప్పడంతో ర్యాంపు, మెట్లను మాజీ సర్పంచు కూల్చి వేసినట్లు తెలిసింది. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ స్వప్నను వివరణ కోరగా పట్టా భూమి వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారని, దానికి సంబంధించిన బిల్లులు కూడా రాలేదన్నారు.

షుగర్, బీపీతోనే కిడ్నీ సమస్యలు

సుభాష్‌నగర్, మార్చి 14: షుగర్, బీపీ అదుపులో లేకుంటే కిడ్నీ సమస్యలు వస్తాయని మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ తెలిపారు. గురువారం వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 500కే అందిస్తున్న కంప్లీట్ కిడ్నీ ప్యాకెజ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల పని తీరు కీలకం

సుభాష్‌నగర్, మార్చి 14: మానవ శరీరంలో మూత్రపిండాల పని తీరు కీలకమని అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కొత్త చాందిని, డాక్టర్ ఎస్ సురేష్ అన్నారు. గురువారం నగరంలోని అపోలో రీచ్ ఆసుపత్రిలో వరల్డ్ కిడ్నీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతం ఆసుపత్రి ఏవో డాక్టర్ నాగసతీష్ మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు తమ ఆసుపత్రిలో కేవలం రూ.999లు చెల్లించి ఈనెల 14 నుంచి జూలై 31 వరకు పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న అల్ఫోర్స్ ఆనందోత్సవ్



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్ టౌన్, మార్చి 14: నగరంలోని అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ పాఠశాల ఆవరణలో గురువారం అల్ఫోర్స్ ఆనందోత్సవ్ పేరిట నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఎంపీ సంజయ్ మాట్లా డుతూ విద్యార్థులకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదువుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

వైద్యశాఖ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల ప్రొవిజినల్ లిస్టు

సుభాష్‌నగర్, మార్చి 14: వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ కింద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, డీఈవో, ఆప్టోమెట్రిస్ట్ పోస్టులకు గతంలోనే దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఇట్టి పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డుతో పాటు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఏదైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత డాక్యుమెంట్లతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 16 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని కోరారు.

చెకుముకి సైన్స్ పోటీల్లో 'రత్నం' విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 14: తెలంగాణ జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయిలో గత ఫిబ్రవరిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన రత్నం పాఠశాల విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. గురువారం స్థానిక రత్నం పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో సిహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావు హాజరై విజేతలైన బి.అమూల్యాదేవి (10వ), కె.వర్షిణి (9వ), ఎం.సాయిరమణ (8వ)కు ప్రశంసాపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో ఎంఈవో మధుసూధనాచారి, ఓయూ ప్రొఫెసర్ బిఎన్‌రెడ్డి, జేవివి అధ్యక్షుడు కె.వి.రావు, పాఠశాల చైర్మన్ కె.రత్నయ్య, కరస్పాండెంట్ కె.రమేశ్, ప్రిన్సిపాల్ కె.ప్రవీణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మార్చి 14: చొప్పదండి పట్టణంలో రూ. 12లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్య క్షుడు ముద్దం తిరుపతిగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలలో ప్రహరీగోడ, వాస్‌రూంలు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి సిఎస్ఆర్ నిధులను వచ్చే విద్యాసంవత్సరంలో మంజూరు చేస్తానని అన్నారు. పాఠశాల విద్యార్థులకు అల్పాహారం రూ. 1.50వేలను ఎమ్మెల్యే అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ బాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈవో వేణు, హెచ్ఎం భగవంతయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్, మార్చి 14: మండలంలోని లక్ష్మీపూర్‌లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నారు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిగురుమామిడి మండలంలోని కొండాపూర్, ర్యాకలదేవ్‌పల్లి గ్రామాలకు చెందిన బత్తుల రాజమ్మ, బత్తుల రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఎంపీ నిధుల ప్రొసీడింగ్ కాపీలు అందజేత

రామడుగు, మార్చి 14: మండల కేంద్రానికి ఎంపీ నిధుల ద్వారా మంజూరు ప్రొసీడింగ్ కాపీలను మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి పలు కుల సంఘాలకు గురువారం అందజేశారు. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ, కమ్మరి, గౌడ సంఘాల భవనాలకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్, పొన్నం శ్రీనివాస్, ఎంపీటీసీ మోడి రవీందర్, అంజిబాబు, రమేశ్, నరేష్ ఉన్నారు.

ఎంపీ బండి సంజయ్ హయాంలోనే అభివృద్ధి

హుజూరాబాద్, మార్చి 14: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హయాంలోనే పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంత మంది బండి సంజయ్ అభివృద్ధి చేయలేదని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. కరీంనగర్‌లో సైనిక్ స్కూల్, శాతవాహన యూనివర్సిటీ, జగిత్యాల-వరంగల్, ఎల్కతుర్తి-సిద్దిపేట రహదారులు, ఆర్వో బ్రిడ్జీలు, రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు ఏర్పాటు చేసింది బండి సంజయ్ కాదా అని ప్రశ్నించారు. అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో నల్ల సుమన్, ప్రభాకర్, శశిధర్, వాసు, రాజు, విజయ్, సారయ్య పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

జమ్మికుంట, మార్చి 14: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టాస్క్) శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్ టాస్క్ కో-ఆర్డినేటర్ బి సువర్ణ, మెంటర్ ఆర్ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం

హుజూరాబాద్, మార్చి 14: తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద రెడ్డిలను ఆదుకునేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర రెడ్డి సంఘం నేతలు అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ త్వరగా ఏర్పాటు చేసి విధివిధానాలు రూపొందించి రెండువేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. సమావేశంలో పోరెడ్డి శంతన్‌రెడ్డి, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సరోజన, సమ్మిరెడ్డి, కోమల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

● రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్దఓసీ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా గూడూరి స్వామిరెడ్డి, గోపు జైపాల్ రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రతాప నాగరాజు, సరోజన, విజయారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రెడ్డి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల కొండల్‌రెడ్డి, నాయకులు మూల పూల్లారెడ్డి, గంగాడి రాజిరెడ్డి, ఎక్కటి రఘుపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కసుబోజుల వెంకన్న, పూదరి రేణుక-శివకుమార్, సుంకరి రమేష్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్యవైశ్య నాయకులు కంకణాల అనిల్ కుమార్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వీణవంక, మార్చి 14: మండలంలోని కోర్కల్ గ్రామంలోని వివిధ కుల సంఘాలకు చెందిన దాదాపు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కురుమ సంఘం అధ్యక్షుడు బూడిగే బీరయ్య, స్వామి, చీర రాములు, అమృత అజయ్, రమేష్, సమ్మయ్య, రవి, సదయ్య తదితరులు ఉన్నారు.

సైదాపూర్: బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మునిగంటి సంతోష్ గురువా రం వెన్కేపల్లిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంతకుముందు సంతోష్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. మళ్లీ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.



పార్టీ కండువా కప్పుతున్న వొడితల ప్రణవ్

కరీంనగర్ ఏఆర్ అడిషనల్ డీసీపీగా అనోక్ జైన్

కరీంనగర్ క్రైం, మార్చి 14 : కరీంనగర్ ఆర్మ్‌డ్ రిజర్వు అడిషనల్ డీసీపీగా అనోక్ జైన్ నియామకమయ్యారు. గత కొంత కాలంగా ఈ పోస్ట్ ఖాళీగా ఉన్నది. కాగా కరీంనగర్ ఏఆర్ డీఎస్పీ సి ప్రతాప్ రామగుండంకు బదిలీ అయ్యారు. అయన స్థానంలో కొత్తగూడెంలో పనిచేస్తున్న డీఎస్పీ విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్ క్రైం, మార్చి 14: కొత్తపల్లి మండలం రేకుర్తిలోని శ్రీనివాస్ అనే ఆర్టీసీ ఉద్యోగి ఇంటిలో గురువారం దొంగలు తాళం పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకుపోయారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ ఆర్టీసీలో ఉద్యోగం చేస్తుండగా అతని భార్య తీగలగుట్టపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. పిల్లలను పాఠశాలకు పంపించిన శ్రీనివాస్ దంపతులు గురువారం ఉదయం విధులకు వెళ్ళిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. తెరచి ఉన్న బీరువాలో చూడగా 8 తులాల బంగారు ఆభరణాలు, 38 తులా వెండి ఆభరణాలతోపాటు ఒక లాప్‌టాప్ కనపడకుండా పోయాయి. బాధితుడు గురువారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగను పట్టుకున్న గ్రామస్థులు

కరీంనగర్ క్రైం, మార్చి 14: కొత్తపల్లి మండలం బావుపేటలో ఒక దొంగను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. గ్రానైట్ క్వారీలలో పాత ఇనుపసామాగ్రి, వైర్లను చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించగా పోలీసులు విచారిస్తు న్నారు. గుర్తుతెలియని దొంగ వద్ద కొంత వైర్ పట్టుబడిందని సమాచారం.

మహిళ మెడలో నగల చోరీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ మంకమ్మతోటలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మహిళ నగలు చోరీ చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంకమ్మతోటకు చెందిన శంకరమ్మ ఇస్త్రీ చేసే తన భర్త బాలయ్యకు లంచ్ బాక్సు ఇవ్వడానికి వెళ్లే క్రమంలో ఇద్దరు వ్యక్తులు అడ్డగించారు. పోలీసులు తనిఖీ చేస్తున్నా రని మహిళ బంగారు నగలు తీసుకొని పారిపోయారు. స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకురాగా వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించా రని సమాచారం. పుస్తెలతాడుతో పాటు ఇతర నగలు చోరీ చేసినట్లు తెలిసింది.

స్లోగన్స్ రైటింగ్‌లో సాయిచంద్ ప్రతిభ

కరీంనగర్ టౌన్, మార్చి14: ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్లోగన్స్ రైటింగ్ పోటీల్లో స్థానిక విద్యావాలి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.సాయిచంద్ ప్రథమ స్థానంలో నిలిచాడు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్ కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లావిద్యాధికారి జనార్ధన్‌రావు చేతుల మీదుగా ఫస్ట్ ప్రైజ్‌తోపాటు 2వేల రూపాయల చెక్కును అందించి అభినందించారు. ఈ సందర్భంగా సాయిచంద్‌ను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్.పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేవెళ్ల దళిత డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ మాల మాదిగలకు ప్రత్యేకమైన కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

●సుభాష్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గురువారం స్థానిక కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, సుద్దాల లక్ష్మన్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్, మార్చి 14: కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ 7.35 లక్షల రూపాయల నిధులు మంజూరీ చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ అన్నారు.

● గంగాధర: మండలంలోని గట్టుబూత్కుర్ జడ్పీ హెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి స్టేషనరీని పంపిణీ చేశారు.

- గంగాధర మండలం వివేకానంద విద్యార్థి గౌతం సాయి ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ అభినందించారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 20న ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమ్మర్ క్యాంపులో భాగంగా శ్రమదానం నిర్వహించారు.

● సంవత్సరాల తరబడి గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లను మల్టీపర్పస్ వర్కర్ల నుంచి వేరు చేసి కారోబార్లుగా ప్రత్యేక హోదా ఇవ్వాలని సైదాపూర్ మండల కారోబార్ల సంఘం అధ్యక్షుడు లంకదాసరి సదయ్య గురువారం అమ్మనగుర్తికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

● వీణవంక: మండలంలోని మాల్లారెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనారోగ్యానికి గురై కరీంనగర్ ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి పాఠశాల విద్యార్థులకు ఏఎస్ఎఫ్ నాయకుడు కేశబోయిన రాము పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జడ్పీ హెచ్ఎస్‌లో మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు విద్యార్థులకు మ్యాథమెటిక్స్‌పై ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు పై ఆకృతిని ప్రదర్శించారు.

- శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్-రమాదేవి దంపతుల కుమారుడు నందన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు.

● బెజ్జంకి: అనాథాశ్రమం ఏర్పాటు చేయాలని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి, జంగాపల్లి గ్రామాలకు చెందిన భామండ్ల రాజు, మహంకాళి ప్రశాంత్, కొంకటి వేణు అనే ముగ్గురు యువకులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బాలుర పాఠశాల వెనకాల ఉన్న సెల్‌టవర్ గురువారం నిరసన తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లిలో సీపీఐ మం డల శాఖ ఆధ్వర్యంలో అనబేరి ప్రభాకర్‌రావు వర్ధంతిని నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి బోయిన తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

- తిమ్మాపూర్ మండలంలోని పొలంపల్లికి చెందిన గ్రామపంచాయితీ ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతి అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద కూతురు తండ్రి చితికి నిప్పు పెట్టింది. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.